కళ్లముందు సంక్రాంతి సందడి

- కొలకలూరులో వైభవంగా ముందస్తు సంబరాలు
- చిన్నారులకు భోగిపళ్ల ఆశీర్వాదం, గర్భిణులకు సీమంతం
- రంగవల్లులతో పోటీ పడిన మహిళలు
- అలరించిన బొమ్మల కొలువు, చిన్నారుల వేషధారణలు



చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, సూపర్‌వైజర్



హరిదాసు వేషధారణలో చిన్నారి

తెనాలిటౌన్: సంక్రాంతి పండుగ మొత్తం కళ్ల ముందు కనిపించింది. తెనాలి రూరల్ మండలం కొలకలూరు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, డ్వాక్రా యానిమేటర్ల సహకారంతో వివిధ పోటీలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో మహిళలకు సీమంతాలు జరిపి, పౌష్టికాహారాన్ని అందజేశారు. సర్పంచ్ చొప్పర ప్రీతి, ఎంపీటీసీ సభ్యురాలు చక్కా సీతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యామిని చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. వివిధ రకాల బొమ్మలను ప్రదర్శనలో ఉంచారు. వివిధ రకాలైన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ రకాల వేషధారణలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శలు ఏర్పాటు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు గొబ్బెమ్మలతో రంగులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ నిర్వాహకురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో పచ్చళ్ల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రకాల పచ్చళ్లను ఏర్పాటు చేయగా మహిళలు, అధికారులు కొనుగోలు చేశారు. అనంతరం పలు పోటీల్లో పాల్గొన్న మహిళలకు, చిన్నారులకు బహుమతులను సర్పంచ్ చొప్పర ప్రీతి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు సీతమ్మ, సూపర్‌వైజర్ యామిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ తెలుగువారి సాంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే సంక్రాంతి పండుగను ముందుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సంక్రాంతి వేడుకలను నిర్వహించిన పంచాయతీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈఈ కె.సుదర్శన్, డీఆర్‌డీఏ సీసీ నాగుల్ మీరా, డ్వాక్రా యానిమేటర్స్ కోట శ్యామల, మంచికలపూడి సత్యవతి, నాగలక్ష్మి, నవీన, అరుణ, గీత, కనకనాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు



రాధా, గోపిక శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



ముగ్గులు వేస్తున్న మహిళలు

క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శివాజీ చౌక్‌లోని శ్రీ కాళీమాత ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గుమ్మడి రమేష్, వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కందెపు సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, డాకా అంకిరెడ్డి, ఉమ్మల వెంకటేశ్వర్లు, వై.శివాజీ, అడపాల నాగేశ్వరరావు, ఎన్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ పూడికతీత



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో గాంధీచౌక్, ఇస్లాంపేట, టెలిఫోన్ ఎక్ఛైంజ్ రోడ్డు, స్వరాజ్ టాకీస్ వద్ద డ్రెయిన్ల పూడికతీత పనులను పారిశుధ్య కార్మికులు శుక్రవారం చేపట్టారు. వ్యర్థాలను తొలగించి, మురుగు పారుదల జరిగేలా చర్యలు చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పనులను పర్యవేక్షించారు. పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనులు పరిశీలించారు.

కొనసాగుతున్న దనుర్మాస వ్రత మహోత్సవాలు



తెనాలిటౌన్: వీఎస్సార్ కళాశాల రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శరణాగతి పీఠం ఆధ్వర్యంలో నరేంద్ర దాసా రామానుజ స్వామి పర్యవేక్షణలో దనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకులు ఎ.వెంకటలక్ష్మి శిష్యుల గోదా కల్యాణం నృత్య రూపకం ప్రదర్శన, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.

మొక్కజొన్న పంట పరిశీలన



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులో మొక్కజొన్న పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్త, ఆత్మ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్త జీఎస్‌వీ ప్రసాద్, ఆత్మ డీడీఏ పి.రామాంజనేయులు, ఏడీఏ జి.ప్రవీణ, వ్యవసాయాధికారులు మొక్కజొన్న, జొన్న పంట పొలాలను సందర్శించారు. మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రస్తుతం మొక్కజొన్న 25రోజుల దశలో ఉందని, ఈ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. కొలకలూరు ఆర్‌బీకే పరిధిలో 450 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో జొన్న, మూడు వేలకు పైగా ఎకరాల్లో పెసర సాగు చేస్తున్నట్లు గ్రామ వ్యవసాయ సహాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, వీఏఏలు నాగరాజు, వంశీ, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం



గుంటూరు ఎడ్యుకేషన్ : గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ ఆధ్వర్యంలో పండరీపురంలో నిర్వహిస్తున్న ఉచిత జేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం విశ్రాంత డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అందే మురళీ వర ప్రసాద్ సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పుల్ని విద్యార్థులకు వివరించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. శిక్షకుడు దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువును సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని, జీవితంలో లక్ష్యాన్ని చేరుకున్నాక తిరిగి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏఎస్‌ఎన్ కళాశాలకు రోలింగ్ ట్రోఫీ

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్



క్రీడాకారులతో ఎమ్మెల్యే శివకుమార్, ప్రిన్సిపల్ రామ్‌చంద్

తెనాలిఅర్బన్: అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల క్రీడాకారులు పతకాలు సాధించారు. ఓవర్ ఆల్ చాంపియన్ షిప్, వరుసగా 13వ సారి రోలింగ్ ట్రోఫీని సాధించినట్లు ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. కళాశాలలో పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 12న పోటీలు జరిగినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ కొలసారి రామ్‌చంద్ మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్‌లో ఆకటి రాజా 185కిలోల విభాగంలో రజతం, ముద్దా తిరుపతిరావు 203 కిలోల విభాగంలో బంగారం, షేక్ రషీద్ 140 కిలోల విభాగం రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. రాగాల వరుణ్ 282కిలోలు, గండికోట సందీప్ కుమార్ 120 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అంబళ్ల కోమల కార్తీక్ 225 విభాగంలో, పాలేరు భార్గవ్‌కుమార్ 160 కిలోల విభాగంలో రజత పతకాలు సాధించారన్నారు. కాలేజ్ లిఫ్టర్లు అద్భుత ప్రతిభను కనబరచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించడంతో పాటు రాగాల అరుణ్ బెస్ట్ లిఫ్టర్ టైటిల్‌ను సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు పాల్గొన్నారు.

పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను ఉపసంహరించుకోవాలి



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అసోసియేషన్ నాయకులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వం పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. ఫ్రెండ్స్ మినీ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీఎస్సార్ కాలేజ్ ఎదురుగా ఉన్న కార్యాలయంలో శుక్రవారం కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల చాలానాల భారం వాహనదారుల మీద పడుతోందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి తమ నడ్డి విరిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి అధ్యక్ష కార్యదర్శులు షేక్ కరిమ్మా, తిరుమలరెడ్డి, నాయకులు మీరాఖాన్, టి.కృష్ణ, షేక్ బాషా, నరసింహారావు, జిలానీ, హరిశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా ప్రసాద్ సేవలు మరవలేనివి



దుర్గాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుబ్రహ్మణ్యం, నాగమణి తదితరులు



దుర్గాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

తెనాలిఅర్బన్: కళాకారుల అభ్యున్నతికి నాగళ్ళ దుర్గాప్రసాద్ చేసిన కృషి మరువరానిదని శ్రీ విజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి నిర్వాహకులు దీపాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగళ్ళ దుర్గాప్రసాద్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉప్పుబజార్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు ఆలపాటి వెంకటేశ్వరరావు, బెజ్జంకి నాగమణి, పాతూరి సుబ్రహ్మణ్యం, దీపాల సత్యనారాయణ, చెన్నం సుబ్బారావు, కఠారి కొండలరావు, కె.విజయసారథిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి సాహితీ లోకానికి దుర్గాప్రసాద్ మరణం తీరని లోటు

తెనాలిటౌన్: తెనాలి ప్రాంతంలో కళాకారులు, సాహిత్య ప్రియులకు దుర్గాప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటు అని పలువురు కళాకారులు పేర్కొన్నారు. ప్రజ్వలిత ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని కవిరాజా పార్కులో శుక్రవారం ప్రజ్వలిత వ్యవస్థాక అధ్యక్షుడు నాగళ్ళ వెంకట దుర్గాప్రసాద్ ద్వితీయ వర్ధంతి సభను జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు కళాకారులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనపర్తి బాబురావు మాట్లాడుతూ ఎందరో కవులు, కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలను అందజేసిన ఘనత దుర్గా ప్రసాద్‌కు దక్కుతుందన్నారు. తెనాలిలో కళాకారుల సంఘ అభివృద్ధికి కళాకారుల భవనం ఏర్పాటుకు దుర్గాప్రసాద్ చేసిన సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ కాంతారావు, మహాత్మ ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి, ఎం.రామలింగేశ్వరరావు, దేవిశెట్టి కృష్ణారావు, కొండమూడి రమేష్, కనపర్తి అబ్రహం లింకన్, బెన్‌హర్, గరికపాటి సుబ్బారావు, కన్నెగంటి మధు, అలపర్తి వెంకటేశ్వరరావు, రాజు, సుభాష్‌చంద్రబోస్, నన్నపనేని రాంబాబు, అచంటి శ్రీనివాసరావు, కనపర్తి డేవిడ్, వాలిగ వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ ప్రసాద్, ఎ.యోహాన్, డి.పూర్ణచంద్రరావు, సీతారామయ్య, పలువురు కళాకారులుపాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్



షీల్డ్ కైవసం చేసుకున్న క్రీడాకారులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ మహిళా కళాశాల క్రీడాకారిణుల్ని ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆమె శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించింది.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



మౌలిక వసతుల గురించి వివరిస్తున్న తహసీల్దార్

కొల్లిపర: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్, నీటి వసతి కల్పిస్తున్నామని తహసీల్దారు జి.నాంచారయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ సుబ్బారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొనే లబ్ధిదారులకు గ్రామస్థాయి అధికారులు స్వయంగా వెళ్లి.. నిర్మాణానికి ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, పావలా వడ్డీ రుణాల గురించి వివరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమత వాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు



రైతులకు పలు సూచనలిస్తున్న తెనాలి ఏడీఏ వెంకటరావు

మున్నంగి(కొల్లిపర): సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు సాధ్యమని తెనాలి ఏడీఏ కె.వెంకటరావు సూచించారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న పంటలలో విత్తన శుద్ధి, మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పంటకైన మోతాదుకు మించి ఎరువులు వాడకూడదన్నారు. పంటలో సస్యరక్షణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. జొన్న , మొక్కజొన్న పంటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణకు వాడాల్సిన మందులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి



మురుగు కాలువలో మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

పిడపర్తిపాలెం(కొల్లిపర): గ్రామాలల్లోని ఇళ్ల మధ్య మురుగు నిల్వతో దోమలు తీవ్రత పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెనాలి ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమం మండల పరిధిలోని పిడపర్తిపాలెం గ్రామంలో మున్నంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, దోమల నిర్మూలనకు ఎబేట్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ.. ఇళ్ల మధ్యలో మురుగులో మడ్డి ఆయిల్, కిరోసిన్ పిచికారి చేసి దోమల లార్వాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచర్ల పుష్పరాజు, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, హెల్త్ అసిస్టెంట్ తుల్లిమిల్లి వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం షేక్ సమి మున్నిసా బేగం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు గృహ వసతి కల్పించడం అభినందనీయం

సీపీఎం నాయకుడు శివసాంబిరెడ్డి



పెదరావూరులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తెనాలిటౌన్: తెనాలి పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 26వేల మంది పేదలకు ప్రభుత్వం గృహ వసతి కల్పించడం అభినందనీయమని సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని లే అవుట్‌లో జరుగుతున్న జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను సీపీఎం ప్రతినిధి బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ తెనాలి డివిజన్ నల్లరేగడి మట్టి ప్రాంతం కావడం వల్ల ఇంటి నిర్మాణాలకు మెరుక వేసుకునేందుకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారులకు రూ.5లక్షలు కేటాయిస్తే గృహ నిర్మాణం పూర్తి అవుతుందని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.భవన్నారాయణ, సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, కె.రవికుమార్, మాగంటి యలమందయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీపై కేసు నమోదు

తెనాలిరూరల్: పరిమితికి మించి అధిక లోడుతో వెళుతున్న లారీపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. తెనాలి మండలం కొలకలూరు వద్ద నంది వెలుగు–గుంటూరు రోడ్డులో అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని ఎస్ఈబీ అధికారులు శుక్రవారం గుర్తించారు. లారీపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజ్‌కు టెండర్లు

తెనాలిఅర్బన్: తెనాలి బస్టాండ్ పరిధిలోని పలు ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలు అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని డిపో మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ లోపు నెల్లూరులోని ఆర్ఎం ఆఫీస్‌లో దాఖలు చేయాలని చెప్పారు. 3న నెల్లూరులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో టెండర్లు తీయడం జరుగుతుందన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన సుబ్బారావుపై పోతురాజు కాలనీకి చెందిన ప్రశాంత్, నాగూర్, అయ్యప్ప స్వల్ప విషయమై ఘర్షణ పడి, దాడి చేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలి పటాలు.. ఖాళీ ప్రదేశాల్లో ఎగరేయాలి



విద్యుత్ ఈఈ వీవీ చిరంజీవి

తెనాలిటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులు గాలి పటాలను ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఎగురవేసుకోవాలని ఏపీ సీపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి సూచించారు. చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రదేశాల్లో గాలి పటాలను ఎగురవేయవద్దని కోరారు. బిల్డింగ్‌లపై ఉండి గాలి పటాలను పిల్లలు ఎగురవేసేటప్పుడు పెద్దలు పక్కన తప్పని సరిగా ఉండాలని, విద్యుత్ తీగలకు తగలకుండా గాలి పటాలను ఎగుర వేసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలకు గాలిపటం చుట్టుకున్నట్లయితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఇది గమనించాలని ఈఈ కోరారు.

సంప్రదాయాల కొనసాగింపు అభినందనీయం



విజేతలను సన్మానిస్తున్న పోలూరి, పక్కన న్యాయమూర్తులు

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత

గుంటూరు లీగల్: సంక్రాంతి పండగ సందర్భంగా సంప్రదాయాల్ని కొనసాగిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎం.వెంకటేశ్వమ్మ, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎ.సునీత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల స్వాతి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోష్నశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. న్యాయమూర్తులు అన్ని ముగ్గులను పరిశీలించి విజేతల్ని ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నారు. పాటిబండ్ల ఇంద్రజకు మొదటి బహుమతి, నాగకమల, ప్రత్యూషకు రెండో బహుమతుల్ని అందజేశారు. మిగిలిన వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జీబీఏ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వేముల జయపాల్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సిద్ధ సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ తాడిశెట్టి వెంకట ఆనందరావు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా నాజరపేట బ్రాంచి, 1-1-63, బుర్రిపాలెం రోడ్, నాజరపేట, తెనాలి-522201, గుంటూరు జిల్లా. ఫోన్: 08644-228065, 228514

బంగారు నగల వేలము ప్రకటన

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	862277610008837	22.900 గ్రాములు	20.600 గ్రాములు	రూ.89,110/- & రూ.500/- [illegible]
[illegible]	862273710000537	17.400 గ్రాములు	15.400 గ్రాములు	రూ.67,700/- & రూ.500/- [illegible]

[illegible] తేది.30-01-2023 [illegible] రూ.5,000/- [illegible] తేది.27-01-2023 [illegible]

తేది : 13-01-2023 సం/- బ్రాంచి మేనేజర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com